# పుట్టెకు పుట్టిన బుద్ధి

ఇది సుమారు రెండు సంవత్సరాల క్రితం సంగతి. అప్పటికి సంవత్సరం నుంచీ నిరుద్యోగిని నేను. ఉద్యోగం కోసం అక్కడా ఇక్కడా తిరుగుతున్నాను. తిరిగి తిరిగి చివరకి ఇక్కడికి వచ్చాను. ఆ సమయంలో ఒక నిర్భాగ్యుడితో పరిచయం ఏర్పడింది. ఒకానొక హోటల్లో వాణ్ని కలుసుకున్నాన్నేను. ఎన్ని చెడ్డలక్షణాలు ఉండాలో అన్నీ ఉన్నాయి వాడికి – తాగుడూ, జూదం, మొదలైనవన్నీను. ఈ తాగుడువల్లే ఎక్కడా ఉద్యోగం పుట్టలేదేమో దివారాత్రాలు ఆ హోటలు గడపదగ్గరే బ్రతికేవాడు. పూర్తిగా ఇరవై అయిదన్నా ఉండవు. యౌవనపు పసిమిలో ఉండాల్సిన వాడి శరీరం నల్లగా మసిబొగ్గులాగ ఉండేది. రాగిడబ్బు చేతిలో పడేసరికి తప్పతాగేసి మళ్ళా వచ్చేసేవాడు యథాస్థానానికి. చెయ్యిజాపి ఎవర్నీ ఏమీ అడిగేవాడు కాదు. వాణ్ణి చూసి ఎవరన్నా డబ్బు ఇస్తే ఉంది లేకపోతే లేదు. ఇంకొకరి జోలికి పోయేవాడూ కాదు. తన గోడేమిటో తనదే! నోరు విడిచి మాటాడకపోయినా నల్లటి అతని కనుపాపలు తృష్ణతో అటూ ఇటూ కదుల్తూ "ఒకే ఒక చుక్క దాహం" అని ప్రచ్ఛిస్తూన్నట్టుండేవి. హృదయమున్న వ్యక్తి ఎవరైనాసరే ఆ కళ్ళని దాటించుకోవడం కష్టం.

ఈ కారణాలన్నీ నన్ను మరీ బంధింపచేశాయి. అందువల్లనే వాడిని అభిమానించకుండా ఉండలేకపోయాను. కావల్సినపుడల్లా తాగుడికి డబ్బులిచ్చే వాడిని. ప్రొహిబిషను రోజుల్లోకూడా వాడికి ఈ సారా ఎక్కడ దొరికేదో ఏమో! త్రాగేసి వచ్చేవాడు. మళ్ళీ కుక్కలాగ వెంటబడి తిరిగేవాడు. ఎక్కడికి వెళ్తే అక్కడికి. కొన్నాళ్ళకి హోటలు గడప వదిలిపెట్టేశాడు. వాణ్ని వదిలించుకోవాలని నాకూ అనిపించలేదు అప్పట్లో.

రెండో రోజు నా గది గుమ్మందగ్గరికి వచ్చి కూర్చున్నాడు. చూస్తూ ఊరుకొన్నాను. మూడో రోజూ అంతే. రాత్రివేళలు కూడా అక్కడే గడిపేవాడు. ఉద్యోగం సద్యోగం లేకుండా ఊరూ వాడా తిరిగేవాడు. దిక్కూ దివాణంలేని వీడు తోడయ్యాడు.వీడిపేరు "రాముడు". కొన్నాళ్ళకి ఈ విషయం ఆలోచించాల్సిన అగత్యం కల్గింది. వీణ్ణి వదిలించుకోవడం కర్తవ్యమైంది. ఎన్నో గంటలు ఆలోచించాను. వెళ్ళగొట్టడానికి నా మట్టుకు నాకే సిగ్గు కల్గింది. వాడి పరిస్థితి తల్చుకు విచారించాను. అటు వంటి నిర్భాగ్యుణ్ణి, అదృష్టహీనుణ్ణి అంతవరకు చూడలేదు నేను. ఒక్కరోజుకూడా నన్ను నోరెత్తి ఏదీ అడగలేదు. గది గడపదగ్గర కూర్చొని నోరు బార్లాజాపి నా కళ్ళల్లోకి కుక్కలాగా చూస్తూ కూర్చొనేవాడు. అంతే! ఆ చూపు చాలు! మనచేత ఏ పనైనా చేయించడానికి.

"నేనే గంపెడు దారిద్ర్యంతో ఏరోజు కారోజు బ్రతకడమెలాగ భగవంతుడా? అని తిరుగుతున్నాను. నీక్కూడా ఎక్కడ ఆధారం కల్పించగలను చెప్పూ? పోయి మరొకరెవర్నన్నా పట్టుకో" అని ఎన్నోసార్లు చెప్పాలనుకొనేవాణ్ని. మళ్ళీ అంతలో యీ మాటలు విన్న తర్వాత వాడి భావాలు గుర్తుకొచ్చేవి. బిక్కచచ్చిపోయి దారీ తెన్నూ తోచక వాడు చూసే వెర్రిచూపు వెన్ను చరిచినట్టు గుర్తుకొచ్చి టక్కున ఆగిపోయేవాణ్ని అనుకొన్న మాటలు చెప్పలేక. వాడికి కళ్ళనీళ్ళంటూ ఉన్నాయో లేదో తెలీదుగాని, నేనీమాటలు అనగానే నల్లటి మాసికలు పడ్డ కోటులోంచి తెల్లటి రుమాలుతో కళ్ళు తుడుచుకు ఏడుస్తాడని తోచింది. "నన్నెందుకిలా వొంటరివాణ్ణి చేసిపోతున్నావ్" అని త్రాగుడువల్ల కైపెక్కిన కళ్ళతో బాధగా చూస్తాడు. చూసి ఏడుస్తాడు. ఏడిచి నిస్సహాయుడిలాగ, దైవోపహతుడిలాగ చేసేదేమీ లేక లేచి వెళ్ళిపోతాడు. మళ్ళీ నాకు కనిపించడు. ఇన్ని ఆలోచనలు తోచాక నోరు విడిచి మాట్లాడడానికే అశక్తుణ్ని అయిపోయాను.

నానుండి అతణ్ని వేరుచేసేకంటే నేనే అతని బారినుండి తప్పుకు పోవడం ఉత్తమ మనిపించింది. ఎట్టకేలకు ఒక రోజున రాముడితో అన్నాను. "చూడు తమ్ముడూ! ఇన్నాళ్ళూ వెదికినా ఉద్యోగం కిమ్మిన్నాస్తి. పొట్టగడవడమే కష్టమైపోతోంది. తెచ్చుకున్న డబ్బులూ అయిపోవచ్చాయి. రేపే మరో ఊరుపోయి ఏదన్నా ఉద్యోగ ప్రయత్నాలు చేసుకోవాలనుకొంటున్నాను. మరేమీ అనుకోకు. చివరంటా నిన్ను సాకలేకపోతున్నాను."

ఇంక కిక్కురుమనలేదు వాడు. నేననుకొన్నట్టు బావురుమని ఏడవలేదు. తెల్లటి బొత్తలుపడ్డ, రుమాలుతో కళ్ళు తడుచుకోనూ లేదు.

ఇదంతా చూసి వాడి మనస్సుని ఆట్టే బాధించనందుకు సంతోషపడి మర్నాటి ప్రయాణానికి నిజంగానే బట్టలు సర్దుకున్నాను.

కాని మర్నాడు రైలుస్టేషను దగ్గరికి వచ్చేసరికి బుక్‌స్టాలులో ఏదో బొమ్మల పుస్తకం తిరగేస్తూ రాముడు కన్పించాడు. నిర్ఘాంతపోయాను. నన్నుచూడగానే వాడు చటుక్కున లేచి నిలబడి రెండు చేతులూ ఎత్తి నమస్కరించి – నా బెడ్డింగుమీద వచ్చి కూర్చొన్నాడు. నేను

క్రుంగి పోయాను. ఇక అప్పట్లో వీణ్ణి వదిలించుకొనే మార్గం చెప్తే తోచలేదు. చివరికి గుండె రాయిచేసుకొని – "ప్రయాణానికి [illegible]" అన్నాను.

తలూపాడు రాముడు.

రైలొచ్చేవరకూ తలపట్టుకు కూర్చొన్నాను. దిక్కూ దివాణంలేని బికారి ఇలా గుదిబండ అవుతాడని కలలో కూడా అనుకోలేదు నేను. ఇప్పుడిక వాడి భారం నా మీద పడనేపడింది. వాణ్ని పోషించడానికే తీర్మానించుకొన్నాను. మహా అయితే వాడి ఖర్చు మరో పదిహేను రూపాయల వరకూ అవుతుంది. వీడుకున్న దురలవాట్లన్నిటినీ మానిపించి మంచి వాణ్నిగా తయారుచేయాలనుకొన్నాను. "సరే తమ్ముడూ! నాతో వచ్చెయ్! కాని మంచిగా బ్రతకడం ఇక ముందునుంచీ నేర్చుకోవాలి" అని గట్టిగా చెప్పాను.

కొత్త ఊర్లో సులువుగానే ఉద్యోగం దొరికింది నాకు. సంతోషించాను. మొదట కొన్నాళ్ళు రాముణ్ని ఇష్టం వచ్చినట్టు తిరగనిచ్చాను. తర్వాత వాణ్ని జాగ్రత్తలో పెట్టొచ్చు. వాడు చేసే ప్రతీపనీ గమనించాను – వాడి బుద్ధి ఏమార్గంలో పనిచేస్తోందో చూడ్డానికి ఏ విధమైన పని వాడు చెయ్యగలడో తెల్సుకొందుకీను. కాని ఎందుకూ పనికిరాని వాడని త్వరలోనే స్పష్టమైంది. అన్ని విధాలా చితికిపోయాడు వాడు. సరే. ఒక్కొక్క విషయం నేనే చెప్పడం ప్రారంభించాను.

"రాముడూ! నువ్వు తాగడం మానుకోవాలి సుమా! అది మంచి పనికాదు. సరైన మార్గంలో నడవడం నేర్చుకో. చూడు. నువ్వు వేసుకొన్న బట్టలు ఎలా మురికిపడుతూ ఉన్నాయో! ఛ ఛ అలాక్కాదు – కొస్త శుభ్రంగా ఉండడం నేర్చుకో" యిలా ఎన్నో చెప్పాను.

నేను చెప్పేవన్నీ ఓర్పుతో వినేవాడు. ఎప్పుడూ తాగుతూండడం వల్ల అర్థం స్ఫురించే నాలుగు ముక్కలు మాట్లాడడం అలవాటు లేకుండా పోయింది. శుభ్రత గురించి గంటలకొద్దీ నేను మాట్లాడాక, చూసి చూసి ఏ బీరకాయల విషయమో ఎత్తుకొనేవాడు. ఇప్పుడు నేను చెప్పినమాటలన్నీ విన్న తర్వాత చిరునవ్వు నవ్వాడు.

"నవ్వుతున్నావే?"

"మరేంలేదు. ఇవాళో మంచి విషయం జరిగింది బాబూజీ! నేను రోడ్డంట వస్తున్నాను. వస్తూంటే ఒక ఆడమనిషి మరో మనిషి నెత్తి మీది పళ్ళబుట్టని చూసుకోకుండా పడదోసింది"

"అయితే?"

"ఈ రెండో మనిషి మొదట మనిషి పళ్ళబుట్టని కావాలని కాలితో తన్ని మరీ తిరగదోసేసింది" విరగబడి నవ్వాడు.

"నేను చెప్పేదానికి దీనికీ ఏం సంబంధం?"

"అబ్బే ఏం లేదు. ఊరికే చెప్పాను."

"నువ్వేమైనా అను. ఈ త్రాగుడుతో నీ మెదడంతా చెడిపోయింది రాముడూ!"

"ఇంకో విషయం బాబూజీ. ఒక పెద్దమనిషి రూపాయి నోటు బజారు వీధిలో జారిపడిపోయింది. పడిపోయేసరికి ఇంకోడు దాన్ని చూసి తీసుకోబోయాడు. ఇంతలోకి మరోడు పరుగెత్తుకు వచ్చి "మొదట ఆ నోటును నేను చూశాను, కాబట్టి అది నాది" అని దెబ్బలాడాడు. ఇద్దరూ యిలా దెబ్బలాడుకొనే సమయానికి పోలీసు వచ్చి ఇద్దర్నీ తన్ని ఆ నోటును తీసుకొని పెద్దమనిషి కిచ్చేశాడు" ఇది చెప్తూ మరీ గట్టిగా నవ్వాడు వాడు.

నిజంగా రాముడికి మతి చలించిపోయిందనుకొన్నాను. నేను చెప్పేదేమిటి? వాడు మాట్లాడుతున్నదేమిటి? "నేనేం చెప్తున్నానో తెలుసా నీకు?" అన్నాను విసుగెత్తిపోతూ.

"చెప్పండి"

"ఎక్కడైనా మంచి ఉద్యోగం చూచుకో – ఇప్పటికి వెయ్యిసార్లు చెప్పా నీ మాటని. అంత నిర్లక్ష్యం చేస్తే ఎలా చెప్పరా? నీమీదైనా నువ్వు అభిమానం చూపెట్టుకో. నాలుగు డబ్బులు తెచ్చుకొంటే పుష్టిగా తిందువుగాని" అన్నాను.

"నాకు ఉద్యోగం ఎవడిస్తాడు బాబూజీ– తాగుబోతు వెధవని"

నిజమేననిపించిది నాకు. తాగుబోతుకి ఉద్యోగం ఎవడిస్తాడు కనుక?

ఇక వాడినేంచెయ్యాలో తోచలేదు నాకు. రోజూ చిలక్కి చెప్పినట్టు చెప్పేవాణ్ని. కాని వినివిని వాడూ మొండి తేరిపోయాడు. నాకూ విసుగేసింది. నాకు కోపం వస్తోందని చూచాయగా తెలిస్తే చాలు. వెంటనే కోటు తీసుకొని వీధిలోకి జారిపోయేవాడు – నెమ్మదిగా. రోజంతా ఎక్కడెక్కడో తిరిగి రాత్రయేసరికి తప్పతాగి ఇంటికి వచ్చేవాడు. వాడికా డబ్బు ఎలా వస్తోందో దేవుడికే తెలియాలి?"

ఒక రోజు మాత్రం ఖరాఖండీగా చెప్పేశాను. "ఇదిగో రాముడూ! నీ విషయం రోజు రోజుకీ ముదిరిపోతోంది. మరోమాటు తాగినట్టు తెల్సిందంటే ఇంట్లోకి రానివ్వను. తెల్సిందా?"

ఈ హెచ్చరిక వినగానే ఆనాడూ, మర్నాడూ ఇంట్లోంచి కదల్లేదు వాడు. కాని మూడోరోజున జారిపోయాడు. వాడికోసం ఎదురుచూస్తూ కూర్చున్నాను. కాని తిరిగి రాలేదు. చివరికి వాడిమీద కోపమంతా కరిగిపోయింది. వాణ్ని మందలించినందుకు నొచ్చుకున్నాను. నేనన్నమాటలకి కించపడి పాపం మొహం చూపించలేక పారిపోయి ఉంటాడనుకొని ఎంతగానో బాధపడ్డాను.

చీకటిపడినా, ఇల్లు చేరలేదు. ఉదయాన్నే గది తలుపు తీసేసరికి నిర్ఘాంతపోయాను. వీధి మెట్లమీద తల ఆనించుకొని ఎముకల్ని కొరికేసే చలిలో పిడచ కట్టుకుపోయి నేలమీద పడుకొని ఉన్నాడు వాడు.

"రాముడూ! ఏమిట్రా ఇది" అన్నాను వాణ్ణి లేపి.

"మళ్ళీ తాగితే మీరు ఇంట్లోకి రానివ్వనన్నారు బాబూజీ. ఎంత ప్రయత్నించినా

తాగకుండా ఉండలేకపోయాను. ఇక మీరెలాగూ ఇంట్లోకి రానివ్వరు. అందువల్ల ఇక్కడే పడుకుండిపోయాను" అన్నాడు తల వొంచుకుని.

"మంచి పని చేశావ్ లే! లోపలికి పద" అని వాణ్ని తీసుకు లోనికొచ్చాను.

"ఎందుకు నన్నిలా బాధపెట్తావ్ రాముడూ – హాయిగా బ్రతకమనేగా నేను చెప్తున్నాను" అన్నాను బాధగా.

"ఏం చెయ్యను చెప్పండి! నేను ఉత్త తాగుబోతుని. ఎందుకూ పనికిరాని వెధవని. నా తెలివితక్కువతనంలో, నాకుసహాయం చేస్తున్న మిమ్మల్ని కూడా బాధపెట్టున్నాను" అన్నాడు. ఈ మాటలంటూంటే వాడి పెదవులు వణికేయి. ఒకటి, రెండు కన్నీటి చుక్కలు చెక్కిళ్ళమీంచి జారాయి. అంతే! ఒక్కసారిగా కళ్ళు మూసుకొని బావురుమని ఏడ్చాడు రాముడు. ఎవరో బాకుతో నా గుండెల్లో పొడిచినట్లనిపించింది. ఇంత సున్నితమైన అంతఃకరణ గల మనిషిని నిష్కారణంగా ఎందుకు నొప్పించానా అని బాధపడ్డాను – అలా దుఃఖిస్తాడని ఒక్కనాటికీ అనుకోలేదు నేను.

"ఏడవకు రాముడూ! మరెప్పుడూ నిన్ను అడ్డుపెట్టనులే" అన్నాను.

ఇలా ఎన్నో రోజులు గడిచిపోయాయి. నా ఆదాయం చాలా తక్కువ అయినా ధైర్యం చేసి, పొదుపుగా వాడుకొంటూ అందులోనే కొన్ని డబ్బు జాగ్రత్త చేసి రెండు కోట్లు కుట్టించుకున్నాను. ఏభైపైగా ఖర్చయింది వాటికి. ప్రాణంతో సమానంగా వాడుకోసాగాను వాటిని. ఈ రెండు కోట్లే ఒకానొక హోరమైన సంఘటనకి దారితీశాయి.

రాముడు ఆనాటి నుంచీ గది కదిలి వెళ్ళడం లేదు. తాగుడు మానేశాడు. అన్నాళ్ళయి ఒక్క చుక్క కూడా తాగలేదని గట్టిగా చెప్పగలను. అప్పట్లో వాణ్ని చూసేసరికి జాలి వేసేది. వాడిన కలవపువ్వులా ముఖాన్ని వేలవేసుకు కూర్చొనేవాడు ముడుచుకుని. నా మాటల్ని లక్ష్యపెట్టి బాగుపడుతున్నాడు కాబోలనుకొన్నాను. లేకపోతే త్రాగడానికి డబ్బైనా దొరక్కపోయి ఉండాలి మరి!

కాని ఒకనాడు నేను ఆఫీసునుంచి వచ్చేసరికి తప్పతాగి తూలుతూ కూర్చొన్నాడు వాడు. వెంటనే అర్థమయింది. డబ్బు లేకనే ఇన్నాళ్ళూ వాడు తాగడం మానేశాడు! ఇప్పుడిక వీడికి డబ్బెలా వచ్చిందో తెల్సుకోవాలి. ఇల్లంతా వెదికాను. తీరాచూస్తే నా రెండుకోటులూ కన్పించలేదు! గదంతా వెదకినా కన్పించకపోయేసరికి నా గుండె బ్రద్దలయింది. ఒక్కసారి పరుగెత్తుకుని పనిమనిషి దగ్గిరికెళ్ళాను. తప్పతాగి పడిఉన్న రాముడిమీద అప్పటికి అనుమానం కలగలేదు నాకు.

"నాకేం తెలీదండి. మీ కోట్లు నేనేం చేసుకొంటానండి? ఇందాక రాముడే వీథులలోకి వెళ్ళివచ్చాడు. వాడేమైనా తీశాడేమో కనుక్కోండి" అన్నది పనిమనిషి.

"నా రెండుకోట్లనీ నువ్వుకాని తీశావేమిటి రాముడూ?" అనడిగాను.

"అబ్బే! లేదు బాబూజీ? నేను వాటిని ముట్టుకోనేలేదు."

తల తిరిగిపోయింది నాకు. చచ్చిచెడీ డబ్బు సంపాయించి కుట్టించుకొన్న కోటులవి. ఇల్లంతా వెదికాను మళ్ళీను. ఎక్కడా కన్పించలేదు. రాముడు మత్తులో అటూయిటూ ఊగిపోతున్నాడు. వాణ్ణి చూడగానే కోపంతో వుడికిపోయాను. పళ్లు బిగించి వాణ్ని చూస్తూ కూచున్నాను. ముఖమంతా ఎర్రబడింది. హఠాత్తుగా వాడు నావేపు తిరిగాడు.

"నిజంగా నేనా కోట్లు తియ్యలేదు. నేను తీశాననుకుంటున్నారేమో? ఒట్టువేసి చెప్తున్నాను. నేను వాటిని చూడనన్నా చూడలేదు"

"అయితే అవెలా పోయాయంటావ్?"

"నేను చూడలేదు"

"వాటికి కాళ్లు మొలిచి ఉండొచ్చులే. ఉన్నపాటునే లేచిపారిపోయి ఉంటాయి. ఏం? ..."

"ఏమో? నాకు తెలీదు."

వాడలా చెప్పగానే నాకు వళ్లు మండిపోయి లేచి లైటు వెలిగించి పెడముఖం పెట్టి మంచం మీద కూర్చొన్నాను.

కొంతసేపటికి రాముడు లేవడం గమనించాను. లేచి నా మంచం దగ్గరికి వచ్చి మణుకుల మీద నిలబడి ఏవో వెదుకుతున్నాడు జాగ్రత్తగా. ఎంతసేపు వెతికాడో చెప్పలేను. "అక్కడ లేవు .... మరి? .... ఎక్కడికి పోయిఉంటాయి? .... ఈ మూల? ఉహూ! .... ఇక్కడా లేవు!" ఇలా గొణుక్కొంటున్నాడు.

"ఏమిటి వెదుకుతున్నావు రాముడూ" అనడిగాను.

"కోట్ల గురించే! ఎక్కడైనా ఉన్నాయేమోనని?"

"నాలాంటి వాడికి ఎందుకు సహాయం చేస్తావు బాబూ! నీ పనేదో నువ్వు చూసుకో" అన్నాను.

"దానికేమిటి లెండి? ఆ మాత్రానికి అరిగిపోతానా? కాని ఈ కోట్లు ఎలా పోయాయా అని"

"ఇలా చూడు?"

"ఏమిటది?"

"ఇన్నాళ్ళు నేను నీకు యిస్తున్న తిండీ బట్టలకూ మారుగా యిలా దొంగలాగ నీచమైన పని చేస్తావనుకోలేదు నేను."

తెల్లబోయి మోకాళ్ళమీద అలానే చేస్తూ ఉండిపోయాడు ఎంతో సేపు. "నాకేం తెలీదు బాబూజీ" అన్నాడు చివరికి.

నేనింకేమీ మాట్లాడలేదు. వాడలాగే నేలని కూర్చొండిపోయాడు. వాడి ముఖంకేసి చూశాను. మంచులాగా తెల్లబడి పోయింది ముఖం. చివరికి లేచి నా దగ్గరికి వచ్చి చేతులు కట్టుకు నిలబడ్డాడు.

"ప్రమాణం చేసి చెప్తున్నాను నేను తియ్యలేదు బాబూజీ?" వణికే కంఠంతో అన్నాడు. వాడి వ్యథని నేను గ్రహించగల్గాను. ఆకులా అల్లల్లాడిపోతున్నాడు. నేనెంతకీ మాట్లాడక పోయేసరికి హతాశుడై గదిలో ఒక మూలకి కుదించుకుపోయి కూర్చుండి పోయాడు.

"కోపంలో నిన్నేమైనా అంటే క్షమించు రాముడూ! సరే. పోయిన కోట్లు ఎలాగో పోయాయి. అవి లేకపోతే నేనిప్పుడు చచ్చిపోనులే. వాటి గురించి మర్చిపోదాం" అన్నాను.

ఆ రాత్రంతా వాడలాగే కూర్చొన్నాడు. మాట్లాడలేదు. మర్నాడు నేను లేచి చూసేసరికి ఆ మూలనే పాతకోటు పరుచుకొని పడుకొని ఉన్నాడు. కాని వాణ్ణిచూసి అప్పట్లో జాలిపడలేకపోయాను. ఎందుకనో లేలీదు. నా సొంత కొడుకు నన్ను మోసం చేసినట్టు మనస్సుకి తీరని అఘాతం కల్గించినట్లు బాధపడ్డాను.

ఆ పదిహేను రోజులూ ఎత్తిన గ్లాసు దించకుండా తాగేశాడు వాడు. ప్రొద్దుటే వెళ్ళిపోయి ఏ రాత్రికో తిరిగివచ్చేవాడు. పదిహేను రోజులూ నేను వాడితో ఒక్కమాటకూడా మాట్లాడలేదు. ఇంకా వాడి మనస్సుని ఈ విషయం తొలిచేస్తున్నట్టుంది. చివరికి తాగుడు మానేశాడు. దగ్గరున్న డబ్బంతా ఖర్చయి పోయినట్టుంది. మళ్ళీ గదిలో అదేమూలన కూర్చొన్నాడు. మూడు రాత్రిళ్లూ మూడు పగళ్లూ నిశ్చలంగా కూర్చుండిపోయాడు. ఉన్నట్టుండి భోరున ఏడవడం ప్రారంభించాడు. అలానే కూర్చొని ఏడ్చాడు. అన్ని విధాలా నాశనమైపోయి – వాడలా కూర్చుని ఏడుస్తూంటే నాకు జాలేసింది.

"ఎందుకేడుస్తావ్ రాముడూ?" అన్నాను.

ఆపాదమస్తకం వణికిపోయాడు. చాలాకాలం తర్వాత మళ్ళీ మొదటిసారిగా ఇవాళ మాట్లాడాను.

"ఏం లేదు బాబూజీ!"

"జరిగిందేదో జరిగిపోయింది. ఎందుకేడుస్తావు? ఊరుకో" అన్నాను.

"ఏదైనా ఉద్యోగం చెయ్యాలని ఉంది" అన్నాడు కొంతసేపటికి ఏడుపుమాని.

"ఏం పని చేస్తావ్?"

"ఏదో ఒక పనిచేస్తాను. చాలా చోట్ల వాకబు చేశాను. మీమీద యిలా ఆధారపడి బ్రతకడం బాగుండదు. నాకెక్కడైనా ఉద్యోగం దొరికితే మీరుణం తీర్చుకొంటాను"

"సరేలే – ఆ విషయానికేం? ఇదివరకులాగే మళ్ళీ మనం బ్రతుకుదాం."

"అలాక్కాదు. మీ కోట్లు నేనే దొంగిలించానని .... మీరనుకోవచ్చు"

"అలాక్కాదు. నేనిక మీతో బ్రతకడం చాలా కష్టం. నన్ను క్షమించాలి బాబూజీ"

"నిన్నిప్పుడు ఎవరు వెళ్ళిపొమ్మన్నారేమిటి?"

"ఎవ్వరూ పొమ్మనలేదు. నేను అంటున్నాను. నేను వెళ్ళిపోవడమే మంచిది"

"ఎక్కడికి వెళ్తావేమిటి? ఉన్నపాటునే వెళ్ళిపోతే బ్రతకడం ఎలాగో కాస్త

ఆలోచించావా? లేదా?"

"వీల్లేదు బాబూజీ! నన్నాపకండి – నేను వెళ్ళిపోతాను – ఇంతవరకటి మనిషి కాదు మీరు. నేను పోతాను... ...."

"నేనేం మారిపోయానేమిటి? నువ్వే మరీ చిన్నపిల్లాడివయిపోయావు – మంచీ చెడూ తెలీడం లేదు నీకు."

"అలాకాదు. ఇన్ని రోజుల బట్టీ మీరు వీధిలోకి వెళ్తూ గదికి తాళం వేసుకుపోతున్నారు. ఇదివరకు అలా చేసేవారా చెప్పండి? – మీరు లక్ష చెప్పండి .... మీకు నా మీద నమ్మకం పోయింది. మరి నేనిక్కడ ఉండను బాబూజీ. ఇంతకు మీరు నాకు చేసిన సహాయానికి చెయ్యెత్తి నమస్కారం చేస్తున్నాను. శలవ్"

అంతే! రాముడు వెళ్ళిపోయాడు. రోజంతా అతని కోసం ఎదురు చూశాను. సాయంకాలం తిరిగి వస్తాడనుకొన్నాను. కాని రాలేదు. మర్నాడు, మూడోనాడు కూడా రాలేదు. నేను భయపడి పోయాను. చాలా బాధపడ్డాను. ఈ విషయం నన్నెంతగానో కలవర పర్చింది. అన్నం ముట్టుకోలేకపోయాను. నిద్ర పట్టింది కాదు. రాముడు నన్ను పూర్తిగా నిస్సహాయుణ్ని చేసిపోయాడనిపించింది. నాలుగో రోజున వాణ్ణి వెదికేందుకు బయల్దేరాను. వీధులూ, హోటళ్ళూ, రోడ్లూ, పార్కులూ – ఒకటేమిటి? అన్నీ వెదికాను. కన్పించిన ప్రతివాణ్ని అడిగాను. బహుశా తిండిలేక నీరసించిపోయి తప్పత్రాగి ఏ కాలువ పక్కనో స్మృతి కోల్పోయి నిరాధారంగా చచ్చిపోయాడేమో! వణికి పోయాను. క్రుంగి పోయి చేతిలో చిల్లిగవ్వ లేకుండా అంత నిస్సహాయ స్థితిలో వెళ్లిపోతున్న వాడిని ఆపడానికి కూడా ప్రయత్నించనందుకు నన్ను నేనే నిందించుకొన్నాను. ఆరో రోజు ఉదయాన్నే నా గది తలుపు చప్పుడవడంతో లేచాను. తలుపు తెరవగానే రాముడు లోనికొచ్చాడు. ముఖం మరీ నల్లబడిపోయింది. తలంతా దుమ్ము కొట్టుకుపోయింది. ఇన్నాళ్ళూ రోడ్డుమీద దొర్లినట్టున్నాడు. అగ్గిపుల్లలా పల్చబడి పోయాడు. కన్పించినందుకు సంతోషించానే కాని వాడి పరిస్థితి చూస్తూంటే గుండె తరుక్కు పోయింది. ఇక వాడికే లోపమూ రాకుండా చూడాలనుకొన్నాను.

"ఇన్నిరోజులూ పత్తాలేకుండా పోయావ్? ఇంత భోజనం చేద్దువుగానిరా" అన్నాను.

"అక్కర్లేదు."

"కాదంటే ఎలా? ఆకలితో అలమటించి పోయినట్టు నీ కడుపే చెప్తోంది. ఇంద. ఈ బత్తాయిపండు తిను. ఉండు. ఈ పాలు మరుగబెట్టి తెస్తాను. రెండు మూడు రకాల పళ్లు కొంటే కాని నీ ఆకలి తీరదు. నాకు తెలుసు" ఇలా ఏవేవో వాగుతూ వాడికెన్ని సపర్యలు చేశానో తెలీదు. ఆవురావురుమని తిన్నాడు. ఇన్నాళ్ళూ వాడు భోజనం ముట్టలేదని సులువుగా తెలిసిపోయింది.

"నాకు నీమీద ఏమీ కోపం లేదు. పిచ్చి పిచ్చి ఊహలు పెట్టుకొని ఎక్కడికీ పోకు" అన్నాను.

ఆనాటి సాయంకాలమే మంచిరకం సారాయి కొనుక్కొచ్చాను. "కాస్త ఇది తాగు. మరికొంచెం చురుకుదనం కలుగుతుంది" అని సీసా అందించాను. చెయ్యి చాచాడు. మళ్ళీ అంతలో తటపటాయించి చటుక్కున నా చేతిలో సీసా లాక్కొని నేలకేసి కొట్టాడు. గాజుముక్కలన్నీ గదంతా చెదిరిపోయాయి.

"ఇదేమిటి రాముడూ" అన్నాను ఆశ్చర్యంతో.

"ఏమీ లేదు."

"నువ్వు త్రాగవా ఏమిటి?"

"లేదు బాబూజీ! త్రాగడం మానెయ్యదల్చుకున్నాను"

"పూర్తిగా మానేస్తావా? లేక యీవేళకు మాత్రమే మానేస్తున్నావా?"

మాట్లాడలేదు వాడు. మనిషి అంతకంతకూ ప్రక్కకి వాలిపోయాడు.

"జ్వరం వచ్చిందా ఏమిటి? నీరసంగా ఉన్నావ్?" అని చెయ్యి పట్టుకొన్నాను. నిజంగానే జ్వరం వచ్చింది. వళ్ళు మరిగిపోతోంది. జ్వరంతో వణికిపోతున్నాడు వాడు. రాత్రయేసరికి వాడి పరిస్థితి మరీ విషమంగా తయారైంది. ఆ రాత్రంతా వాడిదగ్గర మేలుకు కూర్చున్నాను.

రెండు రోజులు వళ్లు తెలీని జ్వరంలో బాధపడ్డాడు. కళ్ళు జ్యోతుల్లా ఎర్రబడిపోయినయి. శరీరం పూర్తిగా వాడిపోయింది. వాడిస్థితి చూసేసరికి భయం కల్గడంతో డాక్టర్ని తీసుకొచ్చాను. వచ్చి చూశాడు. "పరిస్థితి చెయ్యిదాటి పోయింది. నేను ఉండి లాభంలేదు. మహా అయితే మరో రోజు బ్రతుకుతాడు" అన్నాడు. ఆరోజు రానే వచ్చింది.

మంచంమీద అలానే కూర్చొన్నాను. ఇద్దరం నిశ్శబ్దంగా ఉండి పోయాం. ఎందుకూ కాకుండా చచ్చిపోతున్నవాణ్ణి చూడగానే నా గుండె బ్రద్దలవుతోంది. నా ఆప్తబంధువెవరో పోతున్నట్టు గింజుకొనన్నాను. ఆ రోజంతా ఏదో నాతో చెప్పడానికి తికమక పడుతున్నట్టు గమనించాను నేను.

వాడి కళ్ళల్లోకి చూశాను. యజమాని కాలు తాపులు తిన్న కుక్క నిస్సహాయంగా చచ్చిపోతూ చివరిసారిగా చూసే చూపు అతని కళ్ళల్లో గోచరించింది. ఏడ్చాను.

"బాబూజీ!"

"ఏం రాముడూ!"

"నా పాతకోటుని కొట్టువాడికి అమ్మేస్తే ఎంత వస్తుందంటారు?"

"సరిగ్గా తెలీదు. బహుశా రూపాయి వరకూ రావచ్చు"

నిజానికి ఆ కోటు దమ్మిడీ కిమ్మత్తుకూడా చెయ్యదని నాకు తెలుసు. అయినా వాడికి స్థిమితం కల్గించడానికి అలా అన్నాను.

"నేను అమ్మాలని చూశాను బాబూజీ! నాకు దమ్మిడీ కూడా ఇవ్వనన్నారే!"

"నీకు యివ్వరు. నాకయితే యిస్తారు – నేను డబ్బు చేయగలనులే"

"చాలా మంచికోటు! నా జీవితమంతా నన్ను సాకింది. కనీసం మూడు రూపాయలన్నా చేస్తుంది"

"ఇప్పుడా విషయం ఎందుకులే!" అన్నాను.

రాముడు కాస్సేపు నిశ్శబ్దంగా ఉండిపోయాడు. మళ్ళీ కొంతసేపటికి అందుకొన్నాడు.

"బాబూజీ?"

"ఏం రాముడూ?"

"నేను చచ్చిపోయాక నా కోటు అమ్మెయ్యండి. ఆ కోటుతో నన్ను పూడ్చి పెట్టకండి. అది లేకుండా నేను భూమిలో పడి ఉండగలను. కాని ఆ కోటువల్ల ఏదైనా మంచి జరగొచ్చు. మీకు మూడు రూపాయలైనా గడించి పెట్టుంది"

ఈ మాటలు వింటూంటే నా మనస్సెలా వికలమైందో చెప్పలేను. మృత్యువు అతన్ని క్షణక్షణానికీ సమీపిస్తోందని తెలిసి వచ్చింది. నిశ్శబ్దగా ఉండిపోయాం. అలా గంట గడిచిపోయింది. అతనివేపు చూశాను. అతనింకా నావేపు చూస్తూనే ఉన్నాడు. నేతనివేపు చూడగానే తలదించుకొన్నాడు.

"మంచినీళ్ళు కావాలా రాముడూ?"

"ఇవ్వండి బాబూజీ! మీ మేలు మరిచిపోను."

"ఇంకేమైనా కావాలా ఏమిటి నీకు!"

"ఇంకేమీ అక్కర్లేదు .... కాని .... నాకు ...."

"ఏమిటి?"

"చెప్పాలని ... నిజంగా...."

"ఏమిటది రాముడూ"

"ఆ రెండు కోట్లూ .... నిజంగా నేనే! ... క్షమించు .... బాబూజీ!"

"బాధపడకు రాముడూ! అన్నీ మర్చిపో .... చివరి క్షణాల్లో ప్రశాంతంగా ఉండు" తల పక్కకి తిప్పుకొని జలజలకారే కన్నీటిని తుడుచుకొన్నాను.

ఏదో చెప్పాలని శతవిధాలా ప్రయత్నం చేస్తున్నాడు. కూర్చోడానికి ప్రయత్నించాడు. మాట్లాడడానికి ప్రయత్నించాడు. ఏదో అస్పష్టంగా గొణిగాడు. హఠాత్తుగా అతని ముఖం ఎర్రబడి పోయింది ... నావేపు చూశాడు ... అదే చూపు! ... అంతే! హఠాత్తుగా అతని ముఖం తెల్లబడిపోయింది. రాను రాను అతని ముఖం వెన్నెలలాగ, మంచులాగ , మల్లెపువ్వులాగ – మరీ మరీ తెల్లనైంది. క్రమంగా ముఖం వెనక్కి వాలిపోయింది ....

----